క్లుప్తంగా

అవగాహన సదస్సు రేపు

నందిగామ: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌పై పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25వతేదీ ఉదయం పదిగంటలకు విద్యార్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వతేదీ నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



నందిగామ: వైశాఖ పౌర్ణమి నేపథ్యంలో గురువారం నందిగామలోని ఆయా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పట్టణ శివారు పల్లగిరి గుట్టపైగల త్రిశక్తి పీఠంలో కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. దాములూరు కూడలిలో నూతనంగా నిర్మించిన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

దివ్యాంగులను భవిత సెంటర్లలో చేర్పించాలి



కంచికచర్ల : దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గలపిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్, అరుంధతీనగర్, వసంతకాలనీ, ఇందిరాకాలనీలో బడి బయట ఉన్న దివ్యాంగుల విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించే ప్రక్రియను గురువారం చేపట్టారు. ఈసందర్భంగా కనకరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత సెంటర్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి భవిత సెంటర్‌లో చేరే విద్యార్థులకు ప్రయాణ భత్యం కింద ప్రభుత్వం నెలకు రూ. 300 అందజేస్తుందని వివరించారు. బెడ్ రెస్ట్ పిల్లలకు ఇంటి వద్దనే విద్య నందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తల్లిదండ్రులు ప్రత్యేకావసరాలుగల తమ చిన్నారులను భవిత సెంటర్‌లో చేర్పించాలని ఆయన కోరారు.

సందడిగా పెనుగంచిప్రోలు పార్కు



పెనుగంచిప్రోలు: గ్రామంలో చెరువుకట్ట వద్ద రూ.కోటితో ఏర్పాటు చేసిన పార్కు గ్రామస్తులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. గ్రామస్తులతో పాటు సెలవులకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఉక్కపోతను తట్టుకోలేక సాయంత్రం వేళలో పిల్లలు పెద్దలతో కలిసి పార్కును సందర్శిస్తున్నారు. ఊయల ఊగుతూ, జారుబండ మీద జారుతూ రకరకాల ఆటలు ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. అలాగే పెద్దలు కూడా చెరువు పక్కన చల్లని గాలితో వాకింగ్ చేస్తూ, పిల్లలను ఆడిస్తూ సేద తీరుతున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

జగ్గయ్యపేట అర్బన్: తమ కుమార్తె కనిపించడంలేదంటూ ఓవ్యక్తి గురువారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎస్ఐ సూర్యభగవాన్ కథనం మేరకు స్థానిక మఠం బజారుకు చెందిన ఓ 16 ఏళ్ల బాలిక బుధవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. అయితే తెల్లవారి చూసేసరికి బాలిక కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఆమెతండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతీ యువకులకు స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ డొమెస్టిక్ సొల్యూషన్స్, ప్లంబింగ్ జనరల్ కోర్సుల్లో తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. టెన్త్ పాసై 45 ఏళ్లలోపు వయస్సులోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీతో ఈ నెల 29వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా వివరించారు. ఇతర వివరాలకు 77804 29468, 99660 04808 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

పంటమార్పిడితో రైతుకు రక్ష

- భూసారం పెంపుదల
- చీడపీడల నుంచి రక్షణ
- పెట్టుబడులు తగ్గే అవకాశం



పత్తిసాగు అనంతరం మిరపసాగు కోసం సిద్ధం చేస్తున్న పొలం



రబీలో వేసిన మొక్కజొన్న

వత్సవాయి : మే నెల పూర్తికావస్తుంది. జూన్ నెల ప్రారంభంలో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. రైతులు ఏటా సాగుచేసే పంటలనే మళ్లీమళ్లీ వేస్తుండటంతో భూమిలో సారం తగ్గి పెట్టుబడులు పెరగడంతోపాటు దిగబడులు తగ్గిపోతున్నాయి. దీంతో ఏటా ఒకేపంటలను సాగు చేయకుండా పంటల మార్పిడిపై దృష్టిసారించాలని రాష్ట్రప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

చీడపీడల వ్యాప్తి తగ్గుదల..

పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. పంట మార్పిడితోనే అధిక ప్రయోజనాలు ఉన్నాయని వత్సవాయి మండల వ్యవసాయాధికారి వి.రవి కుమార్ వివరించారు. పంట మార్పిడిని అవలంభిస్తే చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గిపోతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పంటమార్పిడి విధానంతో భూమిలో సారం పెరిగి దిగుబడులు కూడా బాగా పెరుగుతాయి.

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు..

- మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగుచేయకుండా ఉంటే మంచిది. ఒకవేళ మిరప పంట సాగుచేస్తే నష్టం తప్ప లాభాలు వచ్చే అవకాశం లేదు.
- పత్తి వేసిన పొలంలో మిరప పంట సాగుచేస్తే లాభసాటిగా ఉంటుంది.
- మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా మిరపపంట సాగుచేయడానికి ముందు సదరు భూమిలో జొన్న, పిల్లిపెసర వంటి పంటను సాగచేసి దాన్ని ట్రాక్టర్ ద్వారా తొక్కించి, అనంతరం పంటను సాగుచేస్తే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీవివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా ఉంటాయి.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలు,, నూనెగింజల పంటలను సాగుచేయడం ద్వారా వరికి తెగుళ్ల ఆశించకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగుచేసుకోవచ్చు.

వైభవంగా తిరునాళ్ల మహోత్సవాలు



అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బోనాలు తీసుకువస్తున్న భక్తులు

జయంతి(వీరులపాడు): వీరులపాడు మండలం జయంతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకయ్యస్వామి, శ్రీరమణమ్మతల్లి, శ్రీఅంకమ్మతల్లి, శ్రీపేరంటాళ్ల అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేకువ జామునుంచే అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ తిరునాళ్ల మహోత్సవాలకు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వేళ గ్రామంలో అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షులు జంగా కోటిరెడ్డి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, మారపాక శ్రీనివాసరావు, సాంబిరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లింగాలపాడులో..



లింగాలపాడులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నందిగామ : మండల పరిధిలోని లింగాలపాడులో వేంచేసియున్న శ్రీలక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఆలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణం









జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 12గంటలకు నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి ఇందిరాదత్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి విమలాభాను, వందలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించడంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు.

– జగ్గయ్యపేట అర్బన్

పైకి ధీమా...లోలోన గుబులు

- పార్టీ నాయకులతో టీడీపీ అంతర్గత భేటీ
- పోలింగ్‌శాతం, డబ్బు ప్రభావంపై విశ్లేషణ
- బలమైన సామాజికవర్గం ఓట్ల పైనే ప్రధాన చర్చ

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో గెలుపు ఎవరి సొంతం అవుతుందనే అంశంపై చర్చలు, విశ్లేషణలు జోరందుకున్నాయి. ఫలితం తేలడానికి మరో పదిరోజులు సమయం ఉండగా, గెలుపోటములపై అభ్యర్థులతోపాటు ఇటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

మహిళలు ఎవరి వైపు..

జగ్గయ్యపేట బరిలో ఎవరు గెలుస్తున్నారంటూ పొరుగు నియోజకవర్గాల వారు కూడా ఇక్కడ ఉన్న వారి బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. ఈసారి ఎన్నికల పోలింగ్‌లో యువకులు, మహిళలు, వలస ఓటర్లు అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్న నేపథ్యంలో వీరంతా ఏపార్టీ వైపు నిలబడ్డారనే అంశంపై ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఓటుకు నోటు ప్రభావం ఎంతవరకు ఉంటుందనే దానిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

గెలుపోటములపై తర్జనభర్జన..

ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గెలుపోటములపై ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో జగ్గయ్యపేటలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుస్తారనే చర్చ నియోజకవర్గంలో విస్తృతంగా సాగుతోంది. ఇక టీడీపీ నేతలు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నా.. లోలోన మాత్రం ఢీలా పడుతున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. జగ్గయ్యపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో గెలుపుపై వైఎస్సార్ సీపీ ధీమాగా ఉంది. టీడీపీ నేతలు పైకి విజయం తమదేనని చెపుతున్నా, లోలోన మదనపడుతున్నారు.

ఆ సామాజికవర్గం ఓట్లపై సందేహాలు..

జగ్గయ్యపేట టీడీపీ సీటు విషయంలో మొదటి నుంచి కమ్మ సామాజికవర్గం వారే ఆధిపత్యం వహిస్తున్నప్పటికీ సమీకరణాల దృష్ట్యా గత నాలుగుసార్లుగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన శ్రీరాం తాతయ్యకు ఇస్తున్నారు. దీంతో టీడీపీలో ప్రాధాన్యం తగ్గిపోతోందని ఆ సామాజికవర్గనేతలు వాపోతున్నారు. దీనికితోడు కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలకు టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతుండటం కూడా వారు గుర్రుగా ఉండటానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇదే సామాజిక వర్గానికి చెందిన బొల్లా రామకృష్ణ టీడీపీ టికెట్ కోసం పోటీపడగా, చివరికి తాతయ్యకే ఆపార్టీ అధిష్టానం సీటు ఇచ్చింది. అయితే కమ్మ సామాజికవర్గ నేతలను సమన్వయం చేసుకోవడంలో తాతయ్య విఫలమయ్యారనే వాదనలు ఆ సామాజికవర్గం నేతల నుంచే వినిపిస్తుండటం గమనార్హం. దీంతో అసమ్మతినేతగా ఉన్న బొల్లా వర్గీయులు ఈ ఎన్నికల్లో తనకు అండగా నిలిచారో లేదోనని టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య వర్గం మల్లగుల్లాలు పడుతోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పట్టున్న బొల్లా రామకృష్ణ వర్గీయులు ఆపార్టీని పట్టించుకోలేదనే గుసగుసలు తాతయ్య వర్గానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏదిఏమైనా గెలుపోటములపై ఈ రాజకీయచర్చలకు జూన్ నాలుగోతేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపుతోనే తెరపడనుంది.

‘డోగిపర్తి’ సామాజిక సేవలు వెలకట్టలేనివి



శంకరరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ధర్మారావు, ప్రకాశరావు తదితరులు

విజయవాడ కల్చరల్: డోగిపర్తి శంకరరావు సామాజిక, సాంస్కృతిక సేవలు వెలకట్టలేనివని సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంస్థ (ఇట్ క్లా) అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావు అన్నారు. శారద కళాసమితి, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, ఇట్ క్లా ఆధ్వర్యంలో 60 సంవత్సరాలుగా సామాజిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న గాంధేయవాది డోగిపర్తి శంకరరావుకు తెలుగు వెలుగు పురస్కారం అందజేత కార్యక్రమాన్ని గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ సాంఘిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సేవలను అందించిన వారిని గుర్తించి వారికి తెలుగు వెలుగు పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. 2024 సంవత్సరానికి శంకరావును గుర్తించి అభినందన సభ, సత్కార కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. శారద కళాసమితి కన్వీనర్ ఎంఆర్ఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలకు ప్రభావితుడై ఆయన సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. శారద కళాసమితి ద్వారా వేలాది కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు, హిందీ సినీ నటులను నగరానికి రప్పించి వారిని ఘనంగా సత్కరించిర ఘనత శంకర రావుదేనన్నారు. పురస్కార గ్రహీత శంకరరావు మాట్లాడుతూ గాంధీ జీవితం, ఆయన సత్యసంధత ప్రేరణ కలిగించాయన్నారు. సత్కార కార్యక్రమంలో శారద కళాసమితి కార్యదర్శి, వీవీకే నరసింహారావు, హనుమంతరాయ గ్రంథాలయం పాలక మండలి సభ్యులు నీలం దుర్గారావు, మహబూబ్ అజామ్, గడ్డం సుబ్బారావు.. శంకరరావు సేవలను అభినందిస్తూ ప్రసంగించారు.

వాసవి సేవలు అపూర్వం



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి– విజయవాడ సేవలు అపూర్వమని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. వాసవి–విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ హైస్కూల్ వద్ద 45 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రం ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథి తూనికుంట్ల శ్రీనివాసు మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి పురస్కరించుకొని వాసవి విజయవాడ సంస్థ రెండు దశాబ్దాలుగా మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. పాతబస్తీకి నిత్యం లక్షలాది మంది వ్యాపారవర్గాలు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అటువంటి వారికి మజ్జిగను అందించడం మంచి సేవ చేయడమేనన్నారు. ఇదే స్ఫూర్తితో ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా అమర్‌సుధీర్, మాజేటి రామచంద్రరావు, కార్యక్రమ కన్వీనర్ జల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష తమలపాకుల పూజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైశాఖ మాసం, పూర్ణిమ, శ్రీ కూర్మ జయంతి పురస్కరించుకుని ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం శ్రీ ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ జరిగింది. మందిరం గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల సమీపంలోని శ్రీలక్ష్మీ గణపతి షిర్డీసాయి బాబా భజన మందిరంలో గురువారం వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం చేశారు.

విద్యా చైతన్య ప్రచారోద్యమం

భవానీపురం(విజయవాడపశ్చిమం): విజయవాడ రూరల్ జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యాన గురువారం విద్యా చైతన్య ప్రచారోద్యమం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుజరాత్ కమ్యూనిటీ ప్రెసిడెంట్ ఖతరుడియా అజయ్ మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం, చదువు ప్రాధాన్యత గురించి పిల్లలు, తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అనేక పథకాలు, సౌకర్యాలను అందిపుచ్చుకుని చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ కేఎస్ మల్లీశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం పేద పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో కూడా 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాల్సి ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో టీచర్ పఠాన్ చాందిని, టీఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగాయి. తెల్లవారు జామున అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారికి విశేష అలంకరణ అనంతరం పంచహారతుల సేవ, కుంకుమార్చన, సహస్ర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు తరలివచ్చారు.

నేడు లక్ష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైశాఖ మాసం సందర్భంగా రాణిగారితోట, పుట్టరోడ్డులోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశేష లక్ష పుష్పార్చన(మల్లెపూలతో) నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యర్ర మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్పార్చనకు మల్లెపూలు ఇవ్వదలచిన భక్తులు శుక్రవారం ఉదయం 10గంటల లోపు దేవస్థానంలో అందజేయాలని కోరారు.

విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు ఎంతో మేలు



కంచికచర్లలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు



జగ్గయ్యపేటలో విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

కంచికచర్ల : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జూన్ ఏడోతేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ శిబిరాలకు తమ చిన్నారులను తప్పకుండా పంపించాలని కోరారు. విద్యార్థులకు చెస్, డ్రాయింగ్, యోగా నేర్పించడంతోపాటు ఆటవిడుపుగా మ్యూజికల్ చైర్స్ ఆడించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, యోగా గురువు నవీన్ నాని, ఎం.మల్లికార్జునరావు, బీడీసీ నిర్వాహకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: పౌర గ్రంథాలయ సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు కథలు చెప్పడంతో పాటు వారిచే పుస్తకపఠనం చేయించారు. అంత్యాక్షరి, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.